## క్లుప్తంగా

### 6,914 మందికి ఆసరా సాయం



జొన్నగిరిలో సీఎం ప్రసంగాన్ని టీవీలో వీక్షిస్తున్న పొదుపు మహిళలు

తుగ్గలి : వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత ఆర్థిక సాయం పొదుపు సంఘాలకు అందింది. మండల వ్యాప్తంగా 673 సంఘాల్లోని 6914 మంది డ్వాక్రా మహిళలకు రూ.3.82 కోట్లు జమ అయింది. శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి డ్వాక్రా మహిళల ఖతాలకు నగదు జమ చేశారు. ఆయా గ్రామాల ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన టీవీల ద్వారా సీఎం కార్యక్రమాన్ని డ్వాక్రా మహిళలు వీక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌క్రాంతి పథం సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండలంలో 414 పొదుపు గ్రూపులకు చెందిన 4,761 మంది సభ్యులకు మూడవ విడత కింద రూ.1,47,86,000 సాయం అందినట్లు ఏపీఎం దాసన్న తెలిపారు

### ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు

పత్తికొండ రూరల్ : పదోతరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆర్డీఓ మోహన్‌దాస్ సూచించారు. శనివారం మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థులకు మైత్రీచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయానికి పదిమెట్లు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విజయానికి బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్మోహన్ ఆర్డీఓ చేతుల మీదుగా ఎగ్జామ్‌ప్యాడ్స్, కంబాక్స్‌లు, పెన్నులు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హనుమంతునాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి పేదల పెన్నిధి

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పెన్నిధి అని ఎంపీపీ రంగమ్మ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. మండలంలోని కమ్మరచేడు గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి జగనన్న పాలనలో ఎంతో మేలు జరిగిందన్నారు. మహిళల అభ్యున్నతికి వివిధ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

### కూలీల సంఖ్య పెంచండి



చిన్నహ్యాటలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ మల్లేశ్వరి

ఆలూరు: ఉపాధి పనుల్లో కూలీల హాజరును పెంచాలని ఏపీడీ మల్లేశ్వరి ఉపాధిహామీని సిబ్బందిని ఆదేశించారు. శనివారం హొళగుంద మండలంలోని చిన్నహ్యాట, ఎల్లార్తి, ఆలూరు మండలంలో అరికెర, ముద్దనగేరి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఆలూరు సీఎల్ఆర్సీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో వివిధ మండలాలకు చెందిన ఏపీఓ, టీఏ, ఈసీలు పాల్గొన్నారు.

### శాంతిభద్రలకు భంగం కలిగిస్తే చర్యలు

మద్దికెర : శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. శనివారం మద్దికెర పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది బాధితుల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలన్నారు. అలాగే అసాంఘిక చర్యలు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచాలన్నారు. కార్యక్రమంలో మద్దికెర, తుగ్గలి ఎస్‌ఐలు నాగేంద్ర ప్రసాద్, మల్లికార్జున ఉన్నారు.

### అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ జూటూరు హేమలత

చిప్పగిరి: సమష్టిగా మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ జూటూరు హేమలత అన్నారు. శనివారం స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలు శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ శాఖల పనితీరుపై మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గుమ్మనూరు నారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్ రాజు, ఏఓ ఆనంద్, వైస్ ఎంపీపీ నరసింహులు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# జాగ్రత్తలే శ్రీరామరక్ష

- ప్రబలుతున్న ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులు
- వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్న పిల్లల్లోనే అధికం
- ముందు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



ఆలూరు రూరల్: వేసవికాలం ప్రారంభమైతే చాలు చికెన్‌పాక్స్ (ఆటలమ్మ), గవద బిళ్లల వ్యాధులు ప్రబలుతాయి. ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో వేడికి గ్రామాల్లో ఆయా వ్యాధి లక్షణాలు మొదలయ్యాయి. చాలా మందికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు బాధిస్తున్నాయి. ఆలూరు నియోజకవర్గంలో ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, 11 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఆయా వాటి పరిధిలో దాదాపు 500 మంది ఆటలమ్మ, గవద బిళ్లల వ్యాధులకు గురయ్యారు. అన్ని వయస్సుల వారికి ఈ అంటువ్యాధి సోకే అవకాశం ఉన్నా.. ప్రధానంగా చిన్నారులకు ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు.

**ఎలా వస్తుందంటే..**

చికెన్ పాక్స్ అనేది 'వరిసెల్లా జోస్టర్' అనే వైరస్ వల్ల కలిగే ఒక ఇన్ఫెక్షన్. ఎక్కువగా పిల్లల శరీరాలని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా జనవరి నుంచి జూన్ మధ్య ఈ ఇన్ఫెక్షన్స్ వచ్చే అవకాశాలు ఎక్కువ. ఈ బ్యాక్టీరియా శరీరంలోకి వచ్చిన రెండు వారాలకుగాని వ్యాధి లక్షణాలు బయటపడవు. దీన్నే ఇన్ క్యుబేషన్ పీరియడ్ అని పిలుస్తారు. ఆ పీరియడ్ పూర్తయ్యాక లక్షణాలు బయటపడడం కనపడతాయి. ఈ ఇన్ఫెక్షన్ వస్తే 7 నుంచి 21 రోజులు వరకు శరీరంలో ఉండే అవకాశం ఉంది. ఇది ఒకరి నుంచి మరొకరికి త్వరగా సోకే అంటువ్యాధి.

**లక్షణాలు..**

ఆటలమ్మ, గవదబిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేకపోవడం, తీవ్రంగా నీరసించిపోవడం, శరీరంపై నీటి పొక్కులు, జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తాయి.

### మూఢ నమ్మకాలు వీడాలి



ఆటలమ్మ, గవద బిళ్లల వ్యాధుల విషయంలో నిర్లక్ష్యం చేయరాదు. వేసవి కాలంలో ఎక్కువగా పిల్లలు ఈ వ్యాధుల బారిన పడతారు. ఇది అంటు వ్యాధి. చాలా మంది మూఢనమ్మకాలతో వైద్య సహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. ఇలా చేయడం వ్యాధి తీవ్రత ఎక్కువై కొన్ని సార్లు మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం పడుతుంది. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

-డాక్టర్ మారుతి, మొలగవల్లి పీహెచ్‌సీ

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ఆటలమ్మ సోకిన వారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను ఇవ్వాలి. గవదబిళ్లలు వచ్చిన వారికి గొంతు నొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవపదార్థాలను ఇవ్వాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచన మేరకు మందులు వాడాల్సి ఉంటుంది. అలాగే పిల్లలకు గోరువెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతో పాటు పరిసరాల్ని పరిశుభ్రంగా చూసుకోవాలల్సి ఉంటుంది.

## హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకులచెరువు గ్రామంలో తిమ్మగురుడు తిరుణాల సందర్భంగా పాలపళ్ల విభాగంలో నిర్వహించిన వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఇందులో విజేతగా గోనెగండ్ల మండలం పెద్దనెలటూరు చెవిడి సుంకన్న బోయ సీతారాముడు వృషభాలు నిలిచి రూ.30 వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. గ్రామపెద్దల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పోటీలలో రెండు, మూడు స్థానాలను ఒకే దూరం లాగిన ప్యాపిలి మండలం గుడిపాడు వెంకట్రామిరెడ్డి, గూడూరు మండలం మునగాల అంజనమ్మ మహదేవమ్మల వృషభాలు రెండు, మూడవ బహుమతులు రూ.45 వేలను పంచుకున్నాయి. నాలుగైదు స్థానాల్లో కోడుమూరు వల్కూరు తలారి రామచంద్రుడు, వెంకటగిరి కృష్ణప్రసాద్ వృషభాలు నిలిచి వరుసగా రూ.10,016, రూ.5వేలను గెలుచుకున్నట్లు నిర్వాహకులు ప్రహ్లాద, ట్రాక్టర్ గిడ్డయ్య తెలిపారు.

## స్పోర్ట్స్

### 31 నుంచి కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి జాతరను పురస్కరించుకుని వైఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో 31 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు ఈరన్న, బీసుపల్లి, రవి, లక్ష్మీనారాయణ, ఖాజ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పోటీలో పాల్గొనే జట్లు రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈ నెల 30 లోపు తమ జట్టు పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 9182148165, 82472 30953, 9381946539, 9951368735 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

### క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ

ఆస్పరి: మండలంలోని కైరుప్పల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం కబడ్డీ ఆడుతున్న 14 మంది విద్యార్థినులకు అదే గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగులు రామకృష్ణ, వీరేష్ ఉచితంగా టీ షర్ట్స్ అందజేశారు. చదువుతో పాటు బాలికలు క్రీడల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈశ్వర్‌రెడ్డి, పీడీ రామాంజినేయులు పాల్గొన్నారు.

## వంకను పూడ్చి..వెంచర్‌గా మార్చి



పత్తికొండ-కర్నూలు రోడ్డులో వంక చదును చేసి ప్లాట్లు వేసిన దృశ్యం

పత్తికొండ రూరల్: విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు వాటిలో పాగా వేస్తున్నారు. పత్తికొండ-కర్నూలు ప్రధాన రోడ్డులోని కడుగొమ్మ వంక వద్ద ప్రభుత్వ స్థలంలో ఏకంగా ఓ ప్రైవేట్ వెంచర్ వెలిసింది.శనివారం వంకను, దాని పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని ఓ వ్యక్తి ప్రొక్లయిన్‌తో చదును చేయించారు. దీనిపై తహసీల్దార్ విష్ణుప్రసాద్ వివరణ కోరగా విచారణ జరిపి వంక పోరంబోకు, ప్రభుత్వ స్థలం అక్రమించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## క్రైం కార్నర్

### టీడీపీ నాయకులపై కేసు నమోదు

మద్దికెర : ఇంటిపట్టాల విషయంలో తహసీల్దార్ కార్యాలయంలోకి దూసుకెళ్లడమే గాకుండా తహసీల్దార్ నాగరాజు పట్ల అనుచితంగా ప్రవర్తించిన టీడీపీ నాయకులపై కేసు నమోదైంది. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు ధనుంజయతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా కార్యాలయం ముందు ధర్నా చేయడమే గాకుండా చాంబర్‌లోకి చొరబడి అధికారులపై దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు ఫిర్యాదులో ఉందన్నారు.

### 28న వాహనాల వేలం

పత్తికొండ రూరల్ : నాటుసారా, అక్రమ మద్యం రవాణాలో పట్టుబడిన వాహనాల బహిరంగ వేలాన్ని పత్తికొండ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం వద్ద ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ ప్రశాంత్‌విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.10వేలు చెల్లించాలన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకోలేని వారికి డిపాజిట్ సొమ్ము తిరిగి ఇవ్వబడుతుందన్నారు.

### రూ.20.99 లక్షల ఆదాయం

హొళగుంద: హొళగుంద మేజర్ పంచాయతీలో 2023-24 సంవత్సరానికి వారపు సంత, బస్టాండ్‌లోని హోటళ్లు, పార్కింగ్ తదితర వాటికి శనివారం సర్పంచ్ చలవాది రంగమ్మ అధ్యక్షతన ఆదోని డీఎల్‌పీఓ నూర్జహన్ వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాట ద్వారా పంచాయతీకి మొత్తం రూ.20.99 లక్షల ఆదాయం సమకూరిందని, దీనిని హొళగుందలో గ్రౌండ్ లెవెల్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణ పనులకు ఉపయోగిస్తామని డీఎల్‌పీఓ తెలిపారు.

### రేపు ఎమ్మెల్యే రాక

వెల్దుర్తి: మండల కేంద్రంలో సోమవారం వైకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరవుతారని వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు. మూడో విడత సాయం మండల వ్యాప్తంగా 8,561మంది సభ్యుల ఖాతాల్లో రూ.4,94,56,000 జమ అయిందన్నారు.

### కార్మిక, కర్షక సమస్యలపై పోరాడుదాం

తుగ్గలి : కార్మిక, కర్షకుల సమస్యలపై పోరాటానికి ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం తుగ్గలిలో ఆయన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవసాయ రంగాలు దెబ్బతిని కార్మికులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు, సీపీఎస్ రద్దు, ఎరువుల సబ్సిడీ పెంచి, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘం నాయకులు శ్రీరాములు, రంగరాజు, కొండారెడ్డి, ప్రతాప్, కాంతమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు.

### బాధ్యతగా పని చేయాలి

హొళగుంద: సచివాలయ వలంటీర్లు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఎంపీడీఓ దాసా నాయక్ సూచించారు. శనివారం ఆయన పెద్ద గోనేహాళ్ సచివాలయాన్ని తనిఖీ చేసి పథకాల అమలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పని తీరుపై ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల దరికి చేర్చాలన్నారు. వివక్ష లేకుండా ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

## విద్యా సమాచారం

### 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నందవరం : మండల కేంద్రం నందవరంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో (కేజీబీవీ) 2023-24 విద్యాసంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. 6వ తరగతికి సంబంధించి 40 సీట్లు, ఇంటర్మీడియట్ (ఎంపీసీ)-40 సీట్లు, 8వ తరగతికి 2 సీట్లు, 9వ తరగతిలో 2 సీట్లు ఉన్నాయన్నారు. ఆయా తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల ఏప్రిల్ 20లోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల బాలికలు httppr://apkfbv.apcfrr.in/వెబ్‌సైట్‌ను చూడాలన్నారు. సందేహాలుంటే స్థానిక కేజీబీవీ పాఠశాలలో సంప్రదించాలన్నారు.

# వాల్మీకుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి







శుభాష్‌పురంలో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం దృశ్యం, మద్దికెరలో వాల్మీకి మహర్షి విగ్రహానికి పాలాభిషేకం, ఆస్పరిలో సంబరాలు చేసుకుంటున్న వాల్మీకులు

తుగ్గలి/వెల్దుర్తి/మద్దికెర /చిప్పగిరి/ఆస్పరి: తమ అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని వాల్మీకి నాయకులు పేర్కొన్నారు. వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడంతో ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని వాల్మీకులు హర్షం వ్యక్తం చేశారు. తుగ్గలి మండలం శభాష్‌పురంలో వైఎస్సార్‌సీపీ సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, ఎంపీటీసీ సభ్యురాలు రామాంజినమ్మ, సర్పంచ్ పుష్పావతి, గౌరవ సలహాదారుడు రవి, జొన్నగిరిలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుంత దేవి, పీఎంసీ చైర్మన్ రఘు, తేరప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

- వెల్దుర్తి మండలం రామళ్లకోటలో వైఎస్సార్సీపీ మండల కార్యదర్శి మాధవస్వామి నాయుడు, వెల్దుర్తి పట్టణ కన్వీనర్ వెంకట్ నాయుడు ఆధ్వర్యంలో వాల్మీకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వాల్మీకులను గుర్తించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్సీపీ అన్నారు.
- మద్దికెరలోని పెరవలి గ్రామంలో వాల్మీకి సంఘం నాయకులు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకులు తిమ్మయ్య, శేఖర్ మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్‌తో తమ బతుకులు మారుతాయన్నారు.
- ఆస్పరి మండలంలోని వాల్మీకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండ్ నుంచి ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు కట్టెల గోవర్ధన, సుంకర రామాంజినేయులు, పెద్దయ్య, అశోక్, మసాల ప్రకాష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినందుకు చిప్పగిరి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, ఎంపీపీ జూటూరు హేమలత సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వారు స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు.

# 'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



ఎమ్మిగనూరులో విద్యార్థినులతో ముచ్చటిస్తున్న డీఈఓ రంగారెడ్డి

- జిల్లాలో 149 కేంద్రాలు ఏర్పాటు
- డీఈఓ రంగారెడ్డి వెల్లడి

ఎమ్మిగనూరుటౌన్: పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ రంగారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులతో సమావేశమై ప్రిపరేషన్‌పై సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటిలో మొత్తం 32,782 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లతో కేంద్రంలో ప్రవేశిస్తే డిబార్ చేయడం, అదే ఉపాధ్యాయులైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లాకు చేరిన ప్రశ్నప్రత్రాలను పోలీస్ స్టేషన్లలో భద్రపరిచామన్నారు. ఈవిద్యాసంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం నందవరం మండలంలోని కనకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్, ముగతి మోడల్ స్కూల్, జెడ్పీహెచ్ హైస్కూల్, మండల కేంద్రం నందవరంలో జెడ్పీహెచ్ హై స్కూల్, కేజీబీవీ పాఠశాలలను జిల్లా విద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలంటే భయం వీడాలని విద్యార్థులకు సూచించారు. టీవీలు, సెల్‌ఫోన్ల జోలికి వెళ్లకుండా బాగా చదువుకోవాలన్నారు. కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాలల డీఐఓ ఆదాంబాషా పాల్గొన్నారు.

**మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం**

గోరుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందజేయాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు జిల్లా విద్యాధికారి రంగారెడ్డి ఆదేశించారు. నందవరం మండల కేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీ హైస్కూల్‌లు మధ్యాహ్న భోజనాన్ని డీఈఓ తనిఖీ చేశారు. ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### వైభవంగా వీరభద్ర స్వామి కల్యాణం



వీరభద్రస్వామి, కాళికాదేవి ఉత్సవ విగ్రహాలకు పెళ్లి చేస్తున్న పురోహితులు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున వీరభద్ర స్వామి, కాళికాదేవీలకు కల్యాణం జరిపించారు. పిడకల సమరం అనంతరం పార్వతీ పరమేశ్వరుల సమక్షంలో వీరభద్రస్వామి, కాళికాదేవీల కల్యాణం నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. పురోహితులు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి రాంప్రదసాద్, సర్పంచ్ తిమ్మక్క, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరురూరల్: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న 3 ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సఫర్నీసాబేగం శనివారం ఓ ప్రకనటలో తెలిపారు. ప్రాజెక్ట్ పరిధిలోని కోసిగి మండలంలో పల్లెపాడు సెంటర్ నెం.61లో ఈడబ్ల్యూఎస్, నందవరం మండలంలో హాలహర్వి సెంటర్ నెంబర్-2 లో ఎస్టీ, ఇబ్రహీంపురం సెంటర్ నెంబర్-2లో ఈడబ్ల్యూఎస్ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 29వ తేదీ సాయంత్రంలోపు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

### బీమాసాయం అందజేత

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోమప్ప నగర్‌లో వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త సోమనాథ్ కుమారుడు మహానంది ఆనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ బీమా పథకం కింద తక్షణ సహాయంగా రూ.10వేలు పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారు. త్వరలో మిగిలిన బీమా సొమ్ము మంజూరవుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ నాయకులు గురుదాస్, దేవరాజ్, విశ్వనాథ్, రమేష్,మెకానిక్‌బాష, ఆర్‌ఎస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

### 28న వేలం పాటలు

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంతమార్కెట్, బండిమెట్ట, కమేళాకు సంబంధించి ఈనెల 28వ తేదీన వేలం పాటలు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రంగనాయకులు, సర్పంచ్ హైమవతి తెలిపారు. ఇందులో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.15వేలు డిపాజిట్ చేయాలన్నారు.

### రవాణా రంగాన్ని పరిరక్షించాలి

గోనెగండ్ల: రవాణా రంగాన్ని పరిరక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజినేయులు కోరారు. ఈ అంశంపై ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ట్రాన్స్‌పోర్టు జిల్లా జాతా శనివారం గోనెగండ్లకు చేరింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ రవాణా రంగ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.

### వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

మద్దికెర : గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం మద్దికెరలో గుంతకల్లుకు చెందిన కల్పత ఫిజియోథెరపీ, ఆక్యూపంక్చర్ వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.

### పంచాయతీ వేలాలు వాయిదా

మద్దికెర : మద్దికెర పంచాయతీ మార్కెట్ వేలం పాటలు వాయిదా వేస్తున్నట్లు డీఎల్‌పీఓ శ్రీకాంత్ చౌదరి శనివారం తెలిపారు. పంచాయతీ ఆవరణలో సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన వేలం పాటలు ప్రారంభించారు. అయితే వేలం పాటదారులు సిండికేట్ కావడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. మళ్లీ ఎప్పుడు జరిగేది త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి, పంచాయతీ సలహాదారు బండారు ఆంజనేయులు, ఈఓ రాధ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన వేలం పాటలు


వెల్దుర్తి: రామళ్లకోట గ్రామ పంచాయతీ టోల్‌గేట్ వేలం శనివారం ముగిసింది. పంచాయతీ కార్యాలయంలో ఈఓఆర్డీ నరసింహులు, సెక్రటరీ రెహమత్ ఆధ్వర్యంలో జరిగిన పాటలో గ్రామానికి చెందిన రామకృష్ణ రూ.18,800కు దక్కించుకున్నాడు. వేలం కాలపరిమితి వచ్చే ఏడాది మార్చి 31తో ముగుస్తుందని అధికారులు తెలిపారు.

### ఆలూరు ఈఓ తీరుపై నిరసన

ఆలూరు: ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న ఈఓ కృష్ణకుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అరుణాదేవి ప్లకార్డులు చేత పట్టుకుని నిరసన తెలిపారు. మండలకేంద్రం ఆలూరులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు.

## పత్తికొండ న్యాయవాదుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

- అధ్యక్షుడిగా కృష్ణయ్య
- ప్రధాన కార్యదర్శిగా రంగస్వామి ఎన్నిక



డిక్లరేషన్ అందజేస్తున్న ఎన్నికల అధికారి మైరాముడు

పత్తికొండటౌన్: పత్తికొండ బార్‌అసోసియేషన్ నూతన కార్యవర్గసభ్యుల ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ఆవుల మైరాముడు, సహాయ ఎన్నికల అధికారులు బి.ప్రసాద్‌బాబు, వై.మధుబాబు శనివారం ప్రకటించారు. న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎస్.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా బి.రంగస్వామి, ఉపాధ్యక్షుడిగా కె.దామోదరాచారి, కోశాధికారిగా హెచ్.మహేశ్, లైబ్రరీయన్‌గా జె.రవికుమార్, మహిళాకార్యదర్శిగా కె.సరోజాబాయి, క్రీడాకార్యదర్శిగా మాచాని సోమప్ప ఎన్నికయ్యారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన అనంతరం ఎన్నికైన సభ్యులకు డిక్లరేషన్ పత్రాలు అందజేశారు. నూతన కార్యవర్గసభ్యులను న్యాయవాదులు పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆడిట్ అధికారి పి.ఎల్లారెడ్డి, ప్రస్తుత బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున, న్యాయవాదులు గోపాల్‌రెడ్డి, హెచ్‌కే లక్ష్మన్న, చంద్రశేఖర్‌నాయుడు, నాగేశ్, ఈరన్న, సురేంద్ర, నరసింహయ్య, బాలభాష, జటంగిరాజు, నారాయణస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవిప్రకాశ్, అరుణ్‌కుమార్, అశోక్, సుధాకృష్ణ, భాస్కర్, నాగేశ్, వెంకటేశ్వర్లు, నెట్టేకల్లు, కబీర్‌దాసు, చిన్నమునయ్య, హరి తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి



గుడికల్ చెరువును పరిశీలిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణ వాసులకు మంచి నీరు సరఫరా చేసే ఎస్ఎస్ ట్యాంక్‌తో పాటు ఎల్లెల్సీ కాలువ, గుడికల్ చెరువులో నీటి నిల్వను, ట్యాంక్‌కు నీటి మళ్లింపును మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి శనివారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తుగా ఎస్ఎస్ ట్యాంక్‌ను ఎల్లెల్సీ నీటితో పూర్తిస్థాయిలో నింపాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎల్లెల్సీ డీఈ లక్ష్మణ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, కౌన్సిలర్ శివప్రసాద్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు గట్టుభాజ, వడ్డెరంగన్న, జీఎం బాషా, యూయూ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.